క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాల పంపిణీ



వలంటీర్లకు పత్రాలు అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ వలంటీర్లకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధులను బాధ్యతతో నిర్వహించి తమకు కేటాయించిన కుటుంబ సభ్యుల మన్ననలను పొందాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల అమలు ప్రజలకు వివరించడంతో పాటు ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పిల్లి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు చీకట్ల గోపాలం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కలవచర్ల వెళ్లి పింఛను అందజేత

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరుకు చెందిన దివ్యాంగ పింఛను లబ్ధిదారైన వేగుళ్ళ మంగాదేవి బంధువుల ఇంటికి రాజానగరం సమీపంలోని కలవచర్ల వెళ్ళారు. పింఛను తీసుకునేందుకు వల్లూరు వద్దామనుకునేసరికి అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వల్లూరు వలంటీర్ బోణు చంద్రశేఖర్ కలవచర్ల వెళ్ళి దివ్యాంగ పింఛను అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వలంటీర్ చంద్రశేఖర్‌ను గ్రామ కార్యదర్శి టి.సుభాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర, సహచర వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

వల్లూరు సొసైటీకి విశిష్ట అవార్డు



మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి నుంచి అవార్డు స్వీకరిస్తున్న వల్లూరు సొసైటీ చైర్మన్, సీఈఓ

కపిలేశ్వరపురం: వల్లూరులోని సత్యనారాయణ సొసైటీకి విశిష్ట అవార్డు దక్కింది. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన ఆప్కాబ్ వజ్రోత్సవాలకు ఈ సంఘం చైర్మన్ ముత్యాల సతీష్ కుమార్, సీఈఓ వేగుళ్ళ వెంకట రామారావు ప్రతినిధులుగా హాజరయ్యారు. సహకార సంఘం నిర్వహణ, రైతులకు సేవలందించడంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో ఈ సొసైటీ ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఆహార ఉత్పత్తుల శాఖా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా సంఘం చైర్మన్, సీఈఓలు అవార్డు అందుకున్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు సేవలందించడమూ, రైతుల సహకారంతో అవార్డును అందుకోవడం ఆనందంగా ఉన్నదని వారన్నారు.

వేంకటేశ్వర దేవస్థానం చైర్మన్‌గా 'పోతంశెట్టి'



మండపేట: ప్రసిద్ధి చెందిన పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ స్వీట్స్ వ్యాపారి, ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవాసంస్థ సభ్యుడు పోతంశెట్టి వీరవెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు రెండేళ్ల కాల పరిమితిపై కొత్త కమిటీని నియమిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాలకమండలి సభ్యులుగా బిక్కిన శ్రీనివాస్, పట్నాల మణిదీపిక, ఏలూరి వీరసత్యనారాయణ, బన్నురావూరి రాజేశ్వరి, ఉప్పు వీరరంగా వెంకటలక్ష్మి, మేతర కనకమహాలక్ష్మి, శ్రీరంగం భాస్కర శ్రీనివాసాచార్యులు నియమితులయ్యారు. తాపేశ్వరం మడత కాజా మాతృసంస్థ సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు, మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవాసంస్థ సభ్యులు అభినందనలు తెలిపారు.

'సుప్రీం' తీర్పు హర్షణీయం

మండపేట: గుజరాత్‌లోని సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి విధించిన రెండేళ్ల జైల్ శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. రాహుల్ గాంధీపై ఎన్ని కుట్ర రాజకీయాలు చేసినా చివరకు ఆయనే విజయం సాధిస్తారని శుక్రవారం కామన పేర్కొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మండపేట: బూత్ స్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జోన్-2 పరిశీలకుడు మందాలపు రవికుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, రామచంద్రపురం ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ పరిశీలకుడు చిన్నం బాబూరమేష్, మాజీ ఎమ్మెల్సీ వీవీవీఎస్ చౌదరి పాల్గొని పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు.

వివక్ష లేని సంక్షేమమే ధ్యేయం

- మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
- వెలంపాలెంలో గడప గడపకూ..



వెలంపాలెంలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణు



నదురుబాదలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రామచంద్రపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ కులం, మతం, పార్టీ వివక్షతలు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్ పాలన అందిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వెలంపాలెంలో సర్పంచ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ తదితరులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు శుక్రవారం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, స్థానికంగా ప్రజలకు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, నాయకులు చల్లా శ్రీను, పువ్వల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

రాయవరం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నదురుబాదలో శుక్రవారం సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణాదేవి తదితరులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అధికారంలో ఉన్నపుడు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, అధికార దాహంతో ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మవద్దని ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రజలకు కోరారు. గడపగడపకు వెళ్లి ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, పార్టీ సేవాదళ్ చైర్మన్ వెలగల సత్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు వాసంశెట్టి రాధాకృష్ణ, తవిటికి రత్నకుమార్, కత్తుల అప్పారావు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



శీలలో నూతన సచివాలయ భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్ పాలన కొనసాగుతుందని బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని శీలలో శుక్రవారం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23 లక్షలతో నిర్మించిన ఆర్బీకేలకు మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతి పనీ వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారన్నారు. జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలని పారదర్శకంగా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా వివిధ పథకాల లబ్ధి మొత్తం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమౌతుందన్నారు. అనంతరం మంత్రి వేణుగోపాలకృష్ణ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా టేక్ హోంరేషన్ కిట్లను గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ దడాల కృష్ణకుమారి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, నల్లమిల్లి రామారెడ్డి, ఆర్ఎంసీ చైర్మన్ పండుల గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సొసైటీ పాలకవర్గ ప్రమాణం



గంగాధర్‌ను సత్కరిస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి, పట్టాభిరామయ్యచౌదరి, రాజుబాబు తదితరులు

మండపేట: మండపేటలోని వల్లూరి అప్పారావు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం సొసైటీ ఆవరణలో ఘనంగా జరిగింది. చైర్మన్‌గా పెంకే గంగాధర్, పర్సన్లుగా కొప్పిరెడ్డి కృష్ణ, పొలిమాటి సరోజిని ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈఓ సీహెచ్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన వేడుకకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు ముఖ్య అతిథులుగా హాజరై గంగాధర్‌ను సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, మాజీ చైర్మన్ కుక్కల రామారావు, ఆలయ చైర్మన్లు సూరంపూడి సత్యప్రసాద్, లేగా వెంకన్న, మండపేట శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో లలితా సహస్ర పారాయణ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో మహిళా భక్తుల ఆధ్వర్యంలో రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న లలితా సహస్ర పారాయణ, విష్ణు సహస్ర పారాయణలు శుక్రవారం నాటికి 100 రోజులు పూర్తయినట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. ఈ పారాయణలో పాల్గొంటున్న మహిళలను ఈఓ ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ చండీ హోమందారు ఇంద్రగంటి రామారావు మాట్లాడుతూ ఏప్రిల్ 26న శంకర జయంతి పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచనల మేరకు ప్రారంభించిన పారాయణ నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతున్నందుకు సహకరిస్తున్న మహిళా భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా శ్రావణ శుక్రవారం ఆలయంలో నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళా భక్తులంతా విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

మండపేట: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు అధ్యక్షతన శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణ సాధన లక్ష్యంగా ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ జరగనుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై చావో రేవో తేల్చుకునే చివరి సభ ఇదన్నారు. లక్షలాదిగా మాదిగలు, ఉపకులాల వారు తరలివచ్చి విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని సురేష్ మాదిగ కోరారు. తొలుత కలువపువ్వు సెంటర్ నుంచి రాజారత్న సెంటర్ మీదుగా ఎనిమిదో వార్డు ఎస్సీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప రాష్ట్రపతి బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకుడు డాక్టర్ దూలిపల్లి సుబ్బారావు, సంఘ నాయకులు కాకాడ నూకరాజు, డోకుబుర్ర రాజబాబు పాల్గొన్నారు.

అమ్మ ఆరోగ్యానికి సంపూర్ణ పోషణ

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్ల పంపిణీ



లబ్ధిదారుకు కిట్టు అందిస్తున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి



కోటిపల్లిలో లబ్ధిదారులకు పోషణ కిట్లు అందించిన దృశ్యం

మండపేట: గర్భిణులు, బాలింతలు రక్తహీనత, పోషకాహార లేమికి గురవకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీని శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణితో కలిసి ఎమ్మెల్సీ తోట పట్టణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా సరకులను ఇంటికి తీసుకువెళ్లేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ పథకం కింద ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు పది రకాల సరకులు అందిస్తారన్నారు. వాటిని వృథా చేయకుండా నిర్ణీత సమయంలో వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ తోట సూచించారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ తల్లి పాల విశిష్టతను వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, శెట్టి కల్యాణి, గ్రంధి శ్రీనివాస్, బొక్కా సరస్వతి, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గ, పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు ఓగిరాల దేవి, జొన్నపల్లి సత్తిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతో సమాజానికి మేలు

కపిలేశ్వరపురం: మహిళ ఆరోగ్యంగా ఉంటే సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ పరిధిలోని టేకి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి పాల్గొని మహిళలకు పోషకాహార కిట్లు అందజేశారు. వల్లూరులో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో సర్పంచ్ దాసి మీనాకుమారి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ, వైద్య,ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి, అముజూరు, పామర్రు, యండగండి, కూళ్ల తదితర గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లబ్ధిదారులకు అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారం అందించడం కోసమే సుమారు రూ.1700 విలువైన ఆహార వస్తువులను అందిస్తుందని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లు పెమ్మాడి బేబిసత్తిబాబు, నానా పరపు కల్యాణి, చిల్లే నాగేశ్వరరావు, చీకట్ల సునీతగోపాలం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాతృమూర్తులు ఆరోగ్యంగా ఉండాలి

రామచంద్రపురం రూరల్: రేపటి సమాజంలో పుట్టబోయే బిడ్డలు, వారికి జన్మనిచ్చే మాతృమూర్తులు ఆరోగ్యకరంగా ఉండాలని తద్వారా ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకోవాలని సీఎం జగన్ తపన పడుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం రామచంద్రపురం రూరల్, రామచంద్రపురం పట్టణ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోమ్ కిట్లను బాలింతలు, గర్భిణులకు అందించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని వారిని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

ఆయన వ్యాఖ్యలు అభ్యంతరకరం

కపిలేశ్వరపురం: ఒక టీవీ న్యూస్ ఛానల్‌లోని కార్యక్రమంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి తమ సామాజిక వర్గాన్ని కించపరుస్తూ వ్యాఖ్యానించడం అభ్యంతర కరమైనది నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్నేటి నాగేశ్వరరావు ఖండించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమ సామాజిక వర్గాన్ని మంగలి, మంగలోడు అనే పదాలను ఉచ్చరించడం నేరమంటూ జీవో 50ను తెచ్చిన విషయాన్ని జేసీ ప్రభాకర్ విస్మరించారన్నారు. చట్ట పరిధిలో నిషేధితమైన పదాలను వాడిన ప్రభాకర్‌రెడ్డి తమ సామాజిక వర్గీయులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలపై నిర్మాణ కార్మికులకు అవగాహన

కపిలేశ్వరపురం: భవన నిర్మాణ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై సంపూర్ణ అవగాహన అవసరమని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.పద్మావతి అన్నారు. అంగర సచివాలయంలో శుక్రవారం కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ బీమా పథకంలో సభ్యులందరూ రూ.110 చెల్లించి శ్రామిక ప్రయోజనాలను పొందే వీలు ఉందన్నారు. 2009 చట్టం మేరకు ప్రీమియం చెల్లించిన వారికి పలు ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ శ్రమ్ పథకంలో ఉచితంగా సభ్యత్వాన్ని పొందవచ్చన్నారు. 18 – 59 సంవత్సరాల కార్మికులు సచివాలయంలో ఆధార్ కార్డును సమర్పించడం ద్వారా ఈశ్రమ్ పథకంలో చేరవచ్చన్నారు.విపత్తుల సమయాల్లో కార్మికులను ఆదుకునే సదుపాయం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని పద్మావతి అన్నారు. కార్యదర్శి మహమ్మద్ ఆలీ, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

కాజులూరు: ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కాజులూరు మండల వ్యవసాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం శీలలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంటలపై వినియోగించే ఎరువులు, పురుగు మందుల మోతాదుపై తగు సూచనలు చేశారు. పంటలపై అవసరాన్ని మించి ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయరాదన్నారు. ఎరువులు, గుళికలు వేసేటప్పుడు పొలంలో నీరు తక్కువగా ఉండేలా జాగ్రత్తపడాలన్నారు. ఎరువుల్లో గుళికలు కలిపి ఉపయోగించరాదన్నారు. రైతులు ఎక్కువగా వినియోగించే పలు రకాల ఎరువుల్లో ఏఏ మందు శాతం ఎంతెంత ఉంటుంది, నాణ్యతా ప్రమాణాలను రైతులకు వివరించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు అవసరం

రామచంద్రపురం: పురపాలక సంఘం పరిధిలో ముచ్చుమిల్లి శివాలయం వద్ద మలేరియా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మలేరియా డిపార్ట్‌మెంట్ జోనల్ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొని వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను వివరించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల లార్వా నిల్వకు అవకాశం లేకుండా పాత్రలు ఎప్పటికప్పుడు ఖాళీ చేయాలని సూచించారు. తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో వర్షపు నీరు చేరకుండా వాటిని దూరంగా పారవేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.





